క్లుప్తంగా

ఘనంగా వీడ్కోలు సత్కారం



అసోసియేషన్ కార్యదర్శి హేమంత్‌శేఖర్‌ను సత్కరిస్తున్న సభ్యులు

భీమునిపట్నం: భీమిలి చిన్నబజారు ప్రాంతంలోని జమ్మిచెరువు పార్కు వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.హేమంత్‌శేఖర్‌కు అసోసియేషన్ సభ్యులు ఘనంగా వీడ్కోలు సత్కారం నిర్వహించారు. భీమిలి కోర్టులో అసిస్టెంట్‌గా చేస్తున్న ఆయనకు అనకాపల్లి కోర్టుకు బదిలీ కావడంతో అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.జనార్థనరావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. పార్కు అభివృద్ధికి హేమంత్ శేఖర్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వి.ఎస్.శంకరకుమార్, బి.వెంకటేశ్వరరావు, డి.శేషాద్రి, ఎస్.జోగారావు తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కుల పంపిణీ



బాధిత కుటుంబాలకు బీమా చెక్కులు అందిస్తున్న ఆర్‌ఎం సింహాచలం నాయుడు

తగరపువలస: ప్రతి కుటుంబం నుంచి ఒకరు పారిశ్రామికవేత్త కావాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని యూనియన్ బ్యాంకు రీజినల్ మేనేజర్ కె.సింహాచలం నాయుడు అన్నారు. జూలై 1 నుంచి సెప్టెంబరు 30 వరకు జరగనున్న సురక్ష బీమా ప్రచారంలో భాగంగా ఆనందపురం శాఖలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలన్నారు. ఇటీవల మరణించిన మీసాల సూర్యనారాయణ, పీతల శ్రీను కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల వంతున బీమా చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు శ్రీనాథ నారాయణరావు, చందక సూరిబాబు, కొట్యాడ రెడ్డిబాబు, దొంతల రామారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు నాణ్యమైన విద్య అందించాలి



కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న డైరెక్టర్ రవిప్రకాష్‌రెడ్డి

కొమ్మాది: విద్యార్థినులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా పని చేయాలని విభిన్న ప్రతిభావంతుల, వృద్ధుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.రవి ప్రకాష్ రెడ్డి అన్నారు. సాగర్‌నగర్‌లోని ప్రభుత్వ అంధ బాలికల ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ముందుగా ఆయన తరగతి గదులను, విద్యార్థినులకు ఆహారం అందిస్తున్న బియ్యం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థినులతో సంభాషించి, విద్యా బోధనపై ఆరా తీశారు. పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను, ఫైల్స్‌ను పరిశీలించారు. పాఠశాల అభివృద్ధికి కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాలు విడివిడిగా నిర్వహించేందుకు ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 9.30 నుంచి నిత్య కల్యాణం వైభవంగా జరిపారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

విశేషంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి గరుడసేవను ఆలయ బేడామండపంలో ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజ జరిపి, హారతులిచ్చారు. పూజలో పాల్గొన్న భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.



తోటవీధికి ముంపు ముప్పు

తుపాను సమయంలో ఇళ్లలోకి వచ్చేస్తున్న నీరు

- కొట్టుకుపోతున్న పడవలు, సామగ్రి
- పరిశీలనకే పరిమితమైన 'రక్షణగోడ'
- ఆందోళనలో మత్స్యకారులు

భీమునిపట్నం: భీమిలిలో మత్స్యకారులు నివసించే తోటవీధి ప్రాంతానికి ముంపు ముప్పు పొంచి ఉండటంతో ఆ ప్రాంత ప్రజలు ఆందోళనతో జీవనం సాగిస్తున్నారు. తీరానికి సమీపంలోని బోయివీధి, ఎగువపేటతో పాటు మరికొన్ని ప్రాంతాలు సముద్రమట్టానికి ఎత్తులో ఉన్నా, తోటవీధి పరిసరప్రాంతాలు మాత్రం బాగా లోతట్టుగా ఉన్నాయి. దీంతో ఈదురు గాలులు వీచినా, వర్షం పడినా ఇక్కడ నివసిస్తున్న 300కు పైగా కుటుంబాలు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నాయి.

గోస్తని నదితో ప్రమాదం

ఈ ప్రాంతాన్ని ఆనుకుని గోస్తని నది ప్రవహించడంతో పాటు దాని పక్కనే సముద్రం ఉంటుంది. ఈ కారణంగా భారీ వర్షాలు పడి గోస్తనిలో ప్రవాహం



తుపాను సమయంలో తోటవీధిలోకి వచ్చిన నదిలోని నీరు (ఫైల్)

ఎక్కువగా వచ్చే సమయాల్లో నీరు తోటవీధిలోకి చొచ్చుకుని వచ్చేస్తూ ఉంటుంది. అలాగే, తుపానులు వచ్చే సమయాల్లో సముద్రంలో అలలు పెద్ద ఎత్తున గోస్తని నదిలోంచి ఇక్కడి నివాసాల వద్దకు వచ్చేస్తున్నాయి. దీంతో ఈ ప్రాంతంలో మూడు అడుగులకు పైనే నీరు వచ్చి చేరడంతో పాటు చాలా మంది ఇళ్లల్లోకి నీరు చేరుతోంది. ప్రవాహం కూడా ఉధృతంగా ఉండడంతో పలు సామాన్లతో పాటు, దగ్గరలో ఉంచిన పడవలు, తెప్పలు కొట్టుకుపోతున్నాయి. అసలే చేపలవేటవల్ల ఆదాయం అంతంత మాత్రంగా ఉండగా, ఈ పరిస్థితి వల్ల మరింత నష్టపోవలసి వస్తోందని మత్స్యకారులు చెబుతున్నారు.

పరిశీలనకు పరిమితం

ఎనిమిదేళ్లక్రితం ఇక్కడి పరిస్థితిని గమనించిన అధికారులు వరదనీరు నివాసాల వరకు రాకుండా రక్షణగోడ నిర్మించాలని నిర్ణయించారు. దానికి సంబంధించి పరిశీలన చేశారు. దీంతో తమ ప్రాంతానికి రక్షణ లభిస్తుందని మత్స్యకారులు ఎంతో ఆనందపడ్డారు. కానీ, ఆ తర్వాత గోడ నిర్మాణం కోసం ఒక్క అడుగు కూడా పడలేదు. వర్షాకాలం కావడంతో గంగపుత్రులు ఆందోళన చెందుతున్నారు. తుపాను హెచ్చరికలు చెప్పిన ప్రతీసారి వారంతా బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి రక్షణ గోడ నిర్మించాలని మత్స్యకారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

హుద్‌హుద్ తుపానుతో మరింత నష్టం

2014లో వచ్చిన హుద్‌హుద్ తుపా**నుకు భారీ ఎత్తున** అలలు ఈ ప్రాంతంపైకి **విరుచుకుపడ్డాయి.** ఆ సమయంలో ముందు **జాగ్రత్తగా అక్కడి**వారందరు వేరే ప్రాంతా**నికి వెళ్లడంతో ఎవ**రికీ ప్రమాదం జరగలేదు. **కానీ, చాలా ఇళ్లు** కూలిపోగా అందులోని **సామాన్లన్నీ నీటిలో** కొట్టుకుపోయాయి. దీం**తో వీరిలో చాలామంది** కోలుకోలేని విధంగా నష్టపోయారు. ఇక తుపానులు, భారీ వర్షాల వల్ల గోస్తని నదిలోని నీరు పెద్ద ఎత్తున రావడంతో తరచూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో తుఫాను వస్తోందంటేనే ఈ ప్రాంత మత్స్యకారులందరూ ఆందోళన చెందుతున్నారు.

చినుకు వస్తే కునుకు ఉండదు



ఇక్కడ నీరు రాకుండా ఒడ్డుకు రాకుండా ఉండడానికి ఎటువంటి రక్షణ లేకపోవడంతో తుపానులు, భారీ వర్షాలు పడే రోజుల్లో అందరం ఆందోళన చెందుతున్నాం. గోస్తని నదిలో వరద నీరు వచ్చే సమయాల్లో మా ఇళ్లవద్దకు భారీగా నీరు వచ్చేస్తుండడం పెద్ద సమస్యగా ఉంది.

– బర్రి రాజు, తోటవీధి, భీమిలి

జాప్యం చేయకుండా చర్యలు తీసుకోవాలి



తుపాను సమయాల్లో ఇక్కడ ఎంత ప్రమాదమో, మేం ఎన్ని ఇబ్బందులు పడుతున్నామో ఆ దేవుడికే తెలుసు. అధికారులు మా ఇబ్బందులు అర్థం చేసుకోవాలి. నీరు ఊళ్లోకి రాకుండా త్వరితగతిన రక్షణ గోడ నిర్మించాలి.

– పొట్టి అప్పారావు, తోటవీధి, భీమిలి



గోస్తని నదిని ఆనుకుని ఉన్న తోట వీధి ప్రాంతం

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

పద్మనాభం: పద్మనాభం సబ్‌స్టేషన్ పరిధిలోని రెడ్డిపల్లి ఫీడర్ లైన్‌లో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి వేసే పనులు చేపట్టనున్నందున పొట్నూరు గ్రామ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ జగన్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలియజేశారు.

ఉచిత వైద్య శిబిరం నేడు

తగరపువలస: ఆనందపురం మండలం వేములవలస శ్రీకృష్ణాలయం వద్ద బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నారు. మాజీ సర్పంచ్ కోరాడ అప్పలస్వామినాయుడు ఆధ్వర్యంలో జరిగే ఈ వైద్యశిబిరంలో కంటి, చర్మ సంబంధిత సేవలతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించి, శస్త్రచికిత్సలు నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అప్పలస్వామినాయుడు కోరారు.

3 నుంచి ఆనందపురంలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'

తగరపువలస: ఆనందపురం మండలంలో ఆగస్టు 3 నుంచి రోజూ సాయంత్రం 4 గంటలకు 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం తెలిపారు. కార్యక్రమానికి పార్టీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. 3న పెద్దిపాలెం, 4న తర్లువాడ, 5న వేములవలస, 6న గండిగుండం, 7న గిడిజాల, 8న బోని, 9న గంభీరం, 10న చందక పంచాయతీలలో ఈ కార్యక్రమాలు ఉంటాయని తెలియజేశారు.

'మేం ఎవరినీ ఇబ్బంది పెట్టలేదు'

భీమునిపట్నం: భీమిలి బీచ్‌రోడ్డు సమీపంలో తాము చర్చిని ఏర్పాటు చేయడం ద్వారా ఎవరినీ ఇబ్బంది పెట్టలేదని చర్చి పాస్టర్ టి.సంతోష్‌పాల్ మంగళవారం తెలిపారు. 25 ఏళ్లుగా తాను ఇక్కడే ఉన్నానని, అందరితో కలసిమెలసి ఉంటున్నానని పేర్కొన్నారు. ఎటువంటి అక్రమ నిర్మాణాలు చేయలేదని, పేదలకు తమ వంతు సాయం చేస్తున్నామని తెలిపారు. తాము ఇక్కడ తప్పు చేశామన్న ఆరోపణల్లో ఎటువంటి వాస్తవం లేదని వివరణ ఇచ్చారు.

అమ్మవారికి సారె

తగరపువలస: జీవీఎంసీ ఒకటోవార్డు ఎల్లారమ్మ మెట్టపై ఎల్లారమ్మకు తగరపువలసకు చెందిన భక్తులు మంగళవారం సారె సమర్పించారు. మేళతాళాలు, కాళికానృత్యం, బాణసంచాలతో ప్రధాన రహదారి మీదుగా ఊరేగింపు నిర్వహించి, అమ్మవారికి సారె సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

విద్యుత్‌శాఖ పలకల తరలింపునకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు మధురవాడ అయోధ్యనగర్‌లో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న రిసార్ట్ వద్ద ఉన్న విద్యుత్ శాఖ పలకలను తరలించేందుకు తక్షణ చర్యలు చేపడతామని విద్యుత్ శాఖ జోన్–3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి. సింహాచలం నాయుడు తెలిపారు. విద్యుత్ శాఖ అండర్ గ్రౌండ్ కేబుల్ నిర్మాణానికి ఉపయోగించే పలకలను రిసార్ట్ నిర్మాణంలో వాడుతున్న వైనంపై సాక్షి దినపత్రికలో ఈ నెల 25న 'ప్రైవేట్ రిసార్ట్ నిర్మాణంలో విద్యుత్‌శాఖ పలకలు..!' శీర్షికన ప్రచురితమైన కథనంపై ఈఈ స్పందించారు. మధురవాడ డీఈ కిరణ్‌కుమార్, యూజీ కేబుల్ ఏడీఈ అనీల్, సీవిల్ ఏడీఈ పట్టాభిలతో కలిసి వెళ్లి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడున్న సిమెంట్ పలకలు విద్యుత్ శాఖకు చెందినవేనని నిర్ధారించారు. ఈఈ మాట్లాడుతూ మూడేళ్ల క్రితం ఇక్కడ అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ పనులు నిర్వహించిన ఢిల్లీకి చెందిన మెస్సర్స్ జాక్సన్ లిమిటెడ్ కంపెనీ కాంట్రాక్టర్ ఈ పలకలను ఇక్కడ విడిచిపెట్టి వెళ్లిపోయారని చెప్పారు. వీటిని పూర్తి స్థాయిలో తరలిస్తామన్నారు. కొద్ది రోజుల క్రితమే జెడ్సీ కనక మహాలక్ష్మి, ఏసీపీ తిరుపతిరావు ఈ ప్రాంతాన్ని పరిశీలించి, పనులు నిలుపుదల చేయించిన విషయం విదితమే.



అయోధ్యనగర్‌లో అనధికార రిసార్ట్ వద్ద పలకలు పరిశీలిస్తున్న ఈఈ సింహాచలం నాయుడు

సాంకేతిక ప్రగతితో సుస్థిర అభివృద్ధి

కొమ్మాది: సమాచార సాంకేతిక రంగం, అంతరిక్ష ప్రయోగాలు, రక్షణ రంగ పరిశోధనలలో సాధిస్తున్న ప్రగతి దేశ సుస్థిర అభివృద్ధికి దారి తీస్తుందని అంతరిక్ష శాస్త్ర పరిశోధకులు, పద్మభూషణ్ అవార్డు గ్రహీత, బ్రహ్మోస్ ఏరోస్పేస్ ఎండీ డా.శివథాను పిళ్లై అన్నారు. గీతంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అంతరిక్ష పరిశోధనల ఫలితంగా 2040 నాటికి చంద్రమండలంపై భారతీయ అంతరిక్ష స్టేషన్ నెలకొల్పడంతో పాటు 2047 నాటికి పెద్ద ఎత్తున వ్యోమగాములను పంపే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. సౌరశక్తిని ఇంధనంగా మలచుకోవడానికి సోలార్ పవర్ జనరేటింగ్ ఉపగ్రహాలను అంతరిక్షంలోకి ప్రవేశపెట్టే పరిశోధనలు నిర్వహిస్తున్నారని వెల్లడించారు.



డా. శివథాను పిళ్లైకు జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

ఆటో కార్మికులను వంచించిన కూటమి ప్రభుత్వం

తగరపువలస: ఆటో, మోటారు కార్మికుల సంక్షేమానికి పని చేస్తామన్న కూటమి ప్రభుత్వం ఏడాది దాటినా ఏమీ చేయకుండా వంచించిందని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ అన్నారు. గత ఎన్నికలలో వాగ్దానం చేసిన ప్రకారం ఆటో, మోటారు కార్మికులకు రూ.15 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాములమ్మ థియేటర్ వద్ద ఆటో కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వాహనమిత్ర పథకం ద్వారా ఏటా ఆటో, మోటారు కార్మికులకు రూ.10 వేలు వంతున ఇచ్చి అండగా నిలిచిందన్నారు. కూటమి ప్రభుత్వం రూ.15 వేలు ఇస్తామని, ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. ఇటీవల కొందరు మంత్రులు ఆటో కార్మికులకు రూ.10వేలు ఇస్తామని చెప్పిన ప్రకటనలు వెనక్కు తీసుకుని, ముందుగా ప్రకటించిన రూ.15వేలు వంతున అందించాలన్నారు. అంతకు ముందు అంబేడ్కర్ కూడలి నుంచి ఆటో కార్మికులతో ప్రదర్శన నిర్వహించి, ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొండపు ఈశ్వరరావు, ఎరుసు అప్పలనరసయ్య, సరగడ సీతారాములు, ఎస్.మధు రెడ్డి, కానూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పడాల గోవింద్

గాయపడ్డ కార్మికుడికి వైద్యం అందించాలి

భవన నిర్మాణ కార్మికుల ఆందోళన

మధురవాడ: భవన నిర్మాణ పనులు చేస్తుండగా తీవ్రంగా గాయపడిన కార్మికుడు పూర్తిగా కోలుకునేంత వరకు వైద్యం అందించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు మంగళవారం ఆందోళన చేశారు. యజమాని సకాలంలో స్పందించకపోవడంతో వీరు భవనం వద్ద నిరసన చేపట్టారు. సీఐటీయూ మద్దిలపాలెం జోన్ నాయకుడు పి. రాజ్‌కుమార్ మాట్లాడుతూ 6వ వార్డు గాయత్రి కాలేజీ సమీపంలోని ఓ భవనం వద్ద నిర్మాణ పనుల్లో భాగంగా గత శనివారం మీసాల సురేష్ అనే కార్మికుడు విద్యుత్ మిషన్‌తో పనిచేస్తుండగా, ప్రమాదవశాత్తు తీవ్రంగా గాయపడ్డాడని తెలిపారు. వెంటనే సహచర కార్మికులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా వైద్యానికి రూ.4లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు చెబుతున్నారన్నారు. అంత ఆర్థిక స్థోమత ఆ కుటుంబానికి లేదని తెలిపారు. గాయపడ్డ కార్మికుడు పూర్తిగా కోలుకునే వరకు భవన యజమాని సీహెచ్ రెడ్డి వైద్యఖర్చులు భరించాలని డిమాండ్ చేశారు. కనీసం తమ ఇబ్బందులు చెప్పుకుందామంటే యజమాని అందుబాటులోకి రాలేదని, మధ్యవర్తిని పంపిస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో భవనిర్మాణ కార్మిక సంఘాలు నాయకులు ఎ.కృష్ణ, సీహెచ్.రమణ తదితరులు పాల్గొన్నారు.



టీచర్స్ లే అవుట్‌లో ఆందోళన చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

తీరప్రాంత రక్షణకు పటిష్ట చర్యలు

- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్
- భీమిలి బీచ్ పరిశీలన
- యూఎఫ్‌ఆర్‌ఎం నిధులతో పనులు చేపట్టాలని ఆదేశం

భీమునిపట్నం: భీమిలిలో తీర ప్రాంత పరిరక్షణకు కార్యాచరణ రూపొందించి, పటిష్ట చర్యలు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. భీమిలిలో కోతకు గురైన తీర ప్రాంతాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. తీరప్రాంతంలో మత్స్యకారులతో పాటు ఇతర నివాసాలు కూడా పెద్ద ఎత్తున ఉన్నందున తీరం కోతకు గురైతే వారికి తీవ్రనష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. అలా జరగకుండా ఉండేలా చూడడంతో పాటు రక్షణగోడ నిర్మాణానికి పూర్తిస్థాయిలో ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. తీరప్రాంత రక్షణకు అత్యంత ప్రాధాన్యం ఉందని, జాప్యం లేకుండా పనులు చేపట్టేందుకు అర్బన్ ఫ్లడ్ రిస్క్ మేనేజ్‌మెంట్ (యూఎఫ్‌ఆర్‌ఎం) నిధుల ద్వారా పనులు చేపట్టేలా చూడాలని పర్యవేక్షక ఇంజినీర్ వై.కృష్ణారావును ఆదేశించారు. అనంతరం బీచ్ పార్కును పరిశీలించారు. అక్కడ పరిసరాలు మరింత బాగా ఉండే విధంగా చూడాలని కోరారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

భీమిలి జోన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై కమిషనర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. తాగునీటి సరఫరా, కాలువలు, యూజీడీ పనులు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. బీచ్ వద్ద లైట్‌హౌస్‌ను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేలా ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. ఇంటింటా చెత్త సేకరణ సక్రమంగా జరిగేలా పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా నాలుగో వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు వార్డులో సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ ధనంజయరెడ్డి, డీసీపీ హరిదాస్, ఏసీపీ రామకృష్ణ, జెడ్సీ అయ్యప్పనాయుడు, ఈఈలు శ్రీధర్, వెంకటేష్, సుధాకర్ పాల్గొన్నారు.



బీచ్‌వద్ద కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

అప్పన్న చందన సమర్పణకు రూ.లక్ష విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి చందన సమర్పణకు విశాఖ నగరంలోని ఎండాడకి చెందిన ఆళ్ల వెంకట రామకృష్ణ, రంగమణి దంపతులు రూ.లక్ష విరాళాన్ని అందించారు. సంబంధిత విరాళాన్ని నగదు రూపంలో ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావుకు ఇచ్చారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి, ప్రసాదం, శేషవస్త్రాన్ని అధికారులు అందించారు.



ఏఈవోకు నగదు అందిస్తున్న దాత వెంకట రామకృష్ణ

రైతులు బ్యాంక్ ఖాతాకు ఆధార్ జత చేసుకోవాలి

తగరపువలస: ఆగస్టులో అమలు కానున్న అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించిన లబ్ధిదారులైన రైతులు తమ బ్యాంక్ ఖాతాలకు ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేసుకోవాలని భీమిలి వ్యవసాయాధికారిణి బి.శివకోమలి తెలిపారు. భీమిలి మండలంలోని లక్ష్మిపురం, మజ్జివలస గ్రామాలలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆమె రైతులతో మాట్లాడారు. మండలంలోని 10 రెవెన్యూ గ్రామాలలో 56 మంది రైతులు ఈ అనుసంధాన ప్రక్రియ చేసుకోవలసి ఉందన్నారు. చాలావరకు బ్యాంకు ఖాతాలు క్రియాశీలకంగా కూడా లేవని, ఆ వివరాలను రైతు సేవా కేంద్రం సిబ్బంది ద్వారా అన్ని గ్రామాల రైతులకు తెలియజేశారని చెప్పారు. ఇంకా దీనిపై రైతులకు ఎలాంటి సందేహాలు ఉన్నా రైతు సేవా సిబ్బందిని గానీ లేదా తనను 83310 56420 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. అనంతరం గ్రామాలలో వేరుశనగ పంటలను పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చారు.



లక్ష్మిపురంలో రైతులతో సమావేశమైన భీమిలి ఏవో శివకోమలి

పుష్పాలంకరణలో నేత్రపర్వంగా..

గ్రామదేవతల దర్శనం

తగరపువలస: శ్రావణ మంగళవారాన్ని పురస్కరించుకుని అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. దివీస్ రోడ్డులోని గుడివాడ గ్రామదేవత తోగాలమ్మను బంతి, కనకాంబరం, తులసి, గులాబీ, చామంతి, కాగడాలు, గజమాలతో అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. ముత్యాలమ్మను తులసిమాలలు, వివిధ రకాల పువ్వులతో అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవార్లను భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.



పుష్పాలంకరణలో తోగాలమ్మ



ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ

ఈవీఎం గోదాం తనిఖీ

ఆరిలోవ : రూరల్ తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం గోదాంను కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ మంగళవారం తనిఖీ చేశారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ఆయన గోదాంను సందర్శించారు. గతంలో దానికి వేసిన సీలును పరిశీలించారు. గోదాం చుట్టూ, లోపల ఉన్న సీసీ కెమెరాల పనితీరు పరిశీలిచారు. గోదాం రక్షణ, భద్రతా ప్రమాణాలపై ఆయన ఆరా తీశారు. ఈ సందర్భంగా ఇక్కడ భద్రతా ప్రమాణాల గురించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట రూరల్ తహసీల్దార్ పాల్‌కిరణ్, ఎన్నికల విభాగం సిబ్బంది ఉన్నారు.



ఈవీఎం గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేందిరప్రసాద్, అధికారులు

రోడ్డుపైనే వాడుక నీరు

- డ్రైనేజీల్లేక నిల్వ ఉండిపోతున్న మురుగు
- రాకపోకలకు గ్రామస్తులు, రైతుల అవస్థలు

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో సురాల వారి ఇళ్ల వద్ద మురికి నీరు రోడ్డుపై నిల్వ ఉండి పోతోంది. ఇక్కడ డ్రైనేజీలు లేకపోవడంతో వాడుక నీరు రోడ్డుపైకి వచ్చి చేరుతోంది. దీంతో ఈ రోడ్డుపై రాకపోకలు సాగించడానికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డు మీదుగా తాలాడ వారి కళ్లాల్లో నివసిస్తున్న ప్రజలు, మొకర, సుంకర, కనకల, ముప్వ వారి కళ్లాలకు, పొలాలకు వెళ్లే రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. కృష్ణాపురం గ్రామస్తులు కురపల్లి, రేవిడి, పాండ్రంగి గ్రామాలకు ఈ రోడ్డు మీదుగానే వెళ్లాలి. వారంతా తప్పని పరిస్థితుల్లో ఈ మురుగులోంచే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి. వర్షం కురిస్తే పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. మురికి నీరు పైకి వెళ్లకుండా ఎక్కడికక్కడే రోడ్డు మీద ఉండిపోవడంతో ప్రజలు, రైతులు జారి పడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి, సురాల వారి ఇళ్ల వద్ద సైడు కాలువలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు



సురాల వారి ఇళ్ల వద్ద రోడ్డుపై మురుగు నీటిలోనే రాకపోకలు సాగిస్తున్న ప్రజలు